# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారతదేశ రక్షణ సాంకేతిక పర్యావరణ వ్యవస్థ నుండి ప్రయోజనం పొందాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ASEAN భాగస్వామ్య దేశాలను ఆహ్వానించారు.
- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. న్యూఢిల్లీలో జరుగుతున్న "ఇండియా ఏఐ ఇంపాక్ట్-2026 సమ్మిట్"లో రేపు పాల్గొననున్నారు.
- ❖ రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం ఈరోజు సమావేశమై.. అమరావతిలో 7 కొత్త సంస్థలకు భూములు కేటాయించేందుకు ఆమోదం తెలిపింది.
- ❖ రాష్ట్రంలో ఎన్డియే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత లక్షా 2 వేల 538 కొత్త ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు.

=====================

భారతదేశ ఇండో-పసిఫిక్ వ్యూహానికి Association of Southeast Asian Nations (ASEAN) ఒక మూలస్తంభం వంటిదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. విశాఖలో జరుగుతున్న MILAN - 2026 నావికా విన్యాసాల సందర్భంగా… కేంద్రమంత్రి ఈరోజు తొమ్మిది ASEAN సభ్య దేశాలకు చెందిన నేవీ చీఫ్‌లు, నావికా ప్రతినిధులతో మాట్లాడారు. ఆత్మనిర్భర్ భారత్ ప్రయత్నాలతో అభివృద్ధి చెందిన భారతదేశ రక్షణ సాంకేతిక పర్యావరణ వ్యవస్థ నుండి ప్రయోజనం పొందాలని ఆయన ASEAN భాగస్వామ్య దేశాలను ఆహ్వానించారు. భారతదేశం బిల్డర్స్ నేవీగా రూపాంతరం చెందడానికి INS విక్రాంత్, విశాఖపట్నం - క్లాస్ డిస్ట్రాయర్ లు చిహ్నాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. 1995లో 4 విదేశీ నావికాదళాలతో ప్రారంభమైన నౌకాదళ విన్యాసాలు.. నేడు 74 దేశాలతో అతిపెద్ద ఎడిషన్‌గా అభివృద్ధి చెందాయని అన్నారు. ఇండో-పసిఫిక్ భాగస్వామ్య దేశాల మధ్య విశ్వాసాన్ని పెంపొందించడంలో హిందూ మహాసముద్ర నావికా సింపోజియం (IONS) - కాన్‌క్లేవ్ ఆఫ్ చీఫ్స్, ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ-2026 కీలకమైనవని రక్షణ మంత్రి వివరిస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

=====================

న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న "ఇండియా ఏఐ ఇంపాక్ట్-2026 సమ్మిట్"కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు హాజరుకానున్నారు. "ఏఐ యాక్సిలరేటర్స్, ఫ్యూయలింగ్ ఇండియాస్ ఎకనామిక్ గ్రోత్" అనే అంశంపై జరిగే ప్లీనరీ సెషన్‌లో కేంద్ర వాణిజ్యం, పరిశ్రమలు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల సహాయ మంత్రి జితిన్ ప్రసాద, టీసీఎస్ సంస్థ ప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. అనంతరం రాష్ట్రంలో ఏఐ మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి కల్పనకు సంబంధించి ప్రభుత్వం కొన్ని ఒప్పందాలు చేసుకోనుంది. అదే విధంగా.. ఏఐ, క్వాంటం టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో రాష్ట్రంలోని 10 లక్షల మంది యువతకు నైపుణ్యాలు కల్పించేలా ప్రతిష్టాత్మక ఐటీ సంస్థ ఐబీఎంతో కూడా ప్రభుత్వం ఒప్పందం చేసుకోనుంది.

=====================

చేనేత రంగాన్ని ప్రోత్సహించడం మన అందరి బాధ్యత అని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యాండ్లూమ్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ (ఆప్కో) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల స్టాళ్లను ఆమె ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం, చేనేత ఉత్పత్తుల ప్రోత్సాహానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. పొందూరు ఖాదీ, వెంకటగిరి, ధర్మవరం పట్టు చీరలు, మంగళగిరి, బందరు, మాధవరం చేనేత వస్త్రాలు అద్భుతమైన కలెక్షన్లు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని మంత్రి వివరించారు.

=====================

ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ- 2026లో భాగంగా విశాఖపట్టణం ఆర్కే బీచ్‌లో ఈరోజు జరుగుతున్న ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక పార్క్ హోటల్ కూడలి నుండి కోస్టల్ బ్యాటరీ వరకు జరిగిన పరేడ్ ప్రేక్షకులకు కనువిందు చేసింది. నేవీ ఆపరేషన్ డెమోలో భాగంగా మెరైన్ కమాండోస్ చేసిన సాహస కృత్యాలు అబ్బురపరిచాయి. 60 హెలీకాప్టర్లు, పలు యుద్ధ విమానాలు గగనతలంలో విహరిస్తూ.. సాహసోపేతంగా విన్యాసాలు చేశాయి.

విరామం

=====================

రాష్ట్ర వ్యాప్తంగా 22 లక్షల 30 వేల 703 ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అసెంబ్లీలో ప్రకటించారు. శాసనసభ్యుడు కొణతాల రామకృష్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ... రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ కనెక్షన్ల వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 3 డిస్కంల పరిధిలో లక్షా 2 వేల 538 కొత్త ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశామని, మరో 46 వేల కనెక్షన్లు పెండింగ్ లో ఉన్నాయని చెప్పారు. పీఎం కుసుమ్ పథకం కింద రాష్ట్రంలో ఇప్పటివరకు 2 లక్షల 61 వేల 481 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశామని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

ఏపీఈపీడీసీఎల్ పరిధిలో మొత్తం 2 వేల 947 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని త్వరలోనే భర్తీ చేస్తామని మంత్రి అసెంబ్లీలో తెలిపారు.

=====================

రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం సమావేశం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు జరిగింది. మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్, గుమ్మిడి సంధ్యా రాణి తదితరులు సమావేశంలో పాల్గొని, రాజధాని

అమరావతిలో పలు సంస్థలకు భూకేటాయింపులపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ... మొత్తం 22 సంస్థలకు భూముల కేటాయింపులపై సమావేశంలో చర్చ జరిగిందని, 7 కొత్త సంస్థలకు భూములు కేటాయించేందుకు ఉప సంఘం ఆమోదం తెలిపిందని చెప్పారు. అలాగే.. 11 సంస్థలకు గతంలో చేసిన కేటాయింపుల్లో మార్పులు చేశామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

=====================

సివిల్స్‌లో ఉచిత శిక్షణ దరఖాస్తుల స్వీకరణ బ్రోచర్‌ను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, సమాచార శాఖ మంత్రి పార్థసారథి సచివాలయంలో ఈరోజు విడుదల చేశారు. ఎంపిక కానున్న 200 మంది అభ్యర్థులకు చలసాని బలరామ ప్రసాద్ (సీబీఆర్) అకాడమీ ద్వారా మూడేళ్ల పాటు ఉచిత వసతి, సదుపాయాలతో శిక్షణ ఇవ్వనున్నారు. యూపీపీఎస్సీ, ఏపీపీఎస్సీ ఇతర ఉద్యోగ నియామకాలకు అభ్యర్థులను సన్నద్ధం చేస్తామని ఐఏఎస్ స్టడీ సర్కిల్ చీఫ్ డాక్టర్ లక్ష్మయ్య వెల్లడించారు. 200 మందిలో వంద మంది అమ్మాయిలు ఉంటారని పేర్కొన్నారు.

=====================

జిల్లాలో భారీ ఎత్తున పరిశ్రమలను నెలకొల్పేలా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. విజయనగరం మండలంలోని కొండకరకాం గ్రామం పరిధిలోని ప్రతిపాదిత ఎంఎస్ఎంఈ పార్కు స్థలాన్ని ఆయన ఈరోజు సందర్శించారు. సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న ఈ పార్కులో రోడ్లు, మురుగు కాలువలు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో చర్చించారు. స్థలాన్ని చదును చేసి, వీలైనంత త్వరగా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

=====================

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నూరు శాతం సుఖ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి వైద్యులను ఆదేశించారు. జిల్లాలోని ఆసుపత్రుల పనితీరు, అభివృద్ధి పనులపై సంయుక్త కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డితో కలిసి.. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, వైద్యాధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈరోజు సమీక్ష నిర్వహించారు. సుఖ ప్రసవాలు జరిగేందుకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, సిజేరియన్ కేసులకు గల కారణాలను తెలుసుకొని.. వాటిని నివారించే దిశగా కృషి చేయాలని వైద్యులకు సూచించారు.

=====================

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి పోలవరం జిల్లా దేవీపట్నం మండలంలో పాఠశాలలను ఈరోజు పరిశీలించారు. దావనపల్లి ఆశ్రమ బాలికల వసతి గృహాన్ని, శరభవరం గిరిజన సంక్షేమ పాఠశాలను పరిశీలించిన ఆయన.. బోధన, మధ్యాహ్న భోజన పథకం వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

=====================
=====================